# గోల

మంచిగంధం సబ్బుతో చక్కగా రుద్దుకుని కాగుడు నీళ్ళతో వెచ్చగా స్నానంచేసి ఘుమఘుమలాడుతూ చిన్న గదిలోకొచ్చి తడిబట్ట నేలకు జార్చేసింది కమల.

సరిగ్గా అప్పుడే ఆమె మీదకు టార్చిలైట్ ఫోకస్ వచ్చిపడింది రాంబాణంలా.

అల్మైరాలో తలుపు రెక్క చాటున వెలుగుతున్న కోడిగుడ్డు దీపం నవ్వింది.

వెంకట్రావు యిక ఆగేట్టు లేదు.

పెళ్ళికూతురు చప్పున గొంతుక కూర్చుని ఒక చేత్తో నేలమీది చీరను మీద కప్పుకుంటూ వెళ్ళిపొమ్మన్నట్లు ఎడం చేయి చూపింది.

టార్చిలైటు వెల్తురు పీప్మీదకు తిరిగింది. కూర్చున్న కమల కళ్ళు అమ్మవారి నేత్రాల్లా తిరిగాయి, కించిత్ రౌద్రంగా. నేలమీద దొర్లుతున్న మరచెంబు మూత విసిరేసింది.

ఎర్రగా కాల్తున్న సిగరెట్టు రాలిపడింది

'అమ్మో' అంటూ పెళ్ళికొడుకు చిన్న గదిలోంచి వసారాలోకి పెద్ద గెంతు గెంతాడు

కమల తలుపు గెడపెట్టి 'అమ్మయ్య' అనుకుని బట్టలు వేసుకోవడం మొదలెట్టింది.

తలుపుమీద గాజుల చేతులు దబదబమని మోత్తున్నాయి. కమల గులాబీరంగు జరీచీర కుచ్చెళ్లు సర్దుకుంటూ తలుపు తీసింది నెమ్మదిగా—

'అదేవిటే నీ మొహం యీడ్చా— అదేవి సరసమే!' అని తల్లి లక్ష్మీకాంతమ్మ బుగ్గలు నొక్కుకుంటూ ఆదుర్దాగా విసుక్కుంది.

'నా కిలాంటి అసహ్యపు పనులు మోటుసరసాలు నచ్చవు' అంది తాపీగా, కమల పైట లాగి అంచుల్ని సరిచేసుకుంటూ.

పెళ్ళికొడుక్కి నుదురుమీద టించర్ అయోడిన్ దూదిలో ముంచి అద్ది దాని కంలో చిన్న కట్టు కట్టారు. చిన్న గంటు పడిందంతే—కాస్తుంటే కన్నే పోను—అన్నారంతా! 'దెబ్బెలా తగిలిందిరా అన్నయ్యా' అని ఆడబడుచు కాంతి అడుగుతూంటే 'పెంకు రాలిపడింది మొగం మీద' అన్నాడు వెంకట్రావు.

'ఇదిగో ఈ సమ్మర్లో పెంకులు మార్పించేస్తాను'—అన్నాడు పెళ్ళికూతురి తండ్రి వీరభద్రం.

పురాణం సుబ్రహ్మణ్య శర్మ

'ఈ వూర్నిండా కోతులు. ఇళ్ళెక్కి పెంకులు తిరగదోడేస్తున్నాయ్. కొబ్బరి కాయల్ని పుచ్చెల్ని వేటినీ బతకనివ్వడం లేదు అరటిచెట్ల మీదపడి ఆ కుల్ని పోగులు పెట్టేస్తున్నాయ్. ఒక్క అరటి కాయ దక్కడంలేదు. ఏమన్నా అంటే అంజనేయస్వామి, రామభక్త హనుమాన్ అంటూ వాట్ని వెనకేసుకొస్తారు వెర్రి మూక. పెంకులు ధర బయట చాలా వుంది. అందుకని తోటలో గొయ్యితీసి పెంకుల్ని మనవే చేయించి ఆవం పెట్టి కాల్చిస్తే—మన అవసరానికి గడిచిపోను. మిగిలినవి పంచాయితీవారికి అమ్మితే కర్చులు కలిసొస్తాయనుకున్నా. తీరా తీశాక ఎక్స్ట్రిబుల్ రెయిన్సొచ్చి వచ్చి పెంకులన్నీ నాని ముద్దలూ ముక్కలూ అయిపోయాయి. గ్రామాల్లో పన్లు మున పట్లా జరగట్లేదు ఈ ఇండిరాగాంధీ వచ్చి దేశాన్ని సర్వనాశనం చేస్తోంది. చేసేసిందప్పుడే—అలగావాళ్ళు మన మాట వింటున్నార్టండీ ' వీరభద్రం గారి లెక్చరు అలా పెంకుమ్మించి దేశ రాజకీయాల మీదికి వెళ్ళిపోతోంది.

ఇంతలో పెళ్ళికూతురి తల్లి వచ్చి 'ఇదిగో యేవండోయ్—' అని పక్కకు పిల్చి 'బంగాళా దుంపలు ఎర్రగా వేయిస్తే పెళ్ళికొడుక్కి యిష్టంట — మరీ మీ యిష్టం' అంది చేతులు తిప్పుతూ.

'మహాప్రభో నా వల్ల కాదు. దోసావకాయ జాడీడు మిగిలింది. రాత్రి మిగిలిన పెరుగు కుండల్లో వుంది. నీళ్ళు కలిపి మెంతిమజ్జిగ పో చెయ్! ఇప్పటికే యిల్లు గుల్లయింది—ఇహ నా వల్లకాదు. ఈ బ్రాహ్మడ్ని యీ అంగోస్త్రంతో వడిలెయ్యండి మహాప్రభో—' అని గావు కేకలు పెట్టాడు.

'ఈ మనిషితో ఏం మాట్లాడనమ్మా! వో ముద్దూముచ్చటా లేదు. ఎద్దె వంటే తెద్దెం—ఇదిగో వినండి. పెళ్ళికొడుకు యిహ ఆగేట్టు లేడు. ఈ మనుగుడుపుల్లోనే ఆ కాస్త ముచ్చటా జరిపించేస్తే సరి అదో కొరకరాని కొయ్య మీరూ అంతే—' అని ఆవిడగారు రెండు అరటి పువ్వుల్ని ఆయన చేతికందిచ్చి 'యివి వలవండి. వంటావిడ తొందర పడ్తోంది. అన్నయ్యగారికి అరటిపువ్వు కూరంటే ప్రాణంటా, అరటిదూట పెరుగుపచ్చడంటే వియ్యపురాలికి మోజట. కాస్పేపుండి అలా చిన్నతోటలోకి వెళ్ళి రెండు పనసకాయలు తీయించండి. అక్కడ మనుగుడుపుల్లో పనసపొట్టు మీరే కొట్టి వండకివ్వాలిట—' అని కాలి మట్టెలూ కడియాలూ చప్పుడు చేసుకుంటూ లక్ష్మీకాంతమ్మ నేలమీద పిల్లలు విడిచేసిన బట్టలు పోగుచేసుకుంటూ వంట పందిరిలోకి వెళ్ళిపోయింది.

"దీనస్తల్లి సిగదరగ యీ పనసకాయ కత్తి కనపడి చావదు" అని కొడవలి తీసుకుని తోటలోకి పరిగెత్తాడు పెళ్ళికూతురు తండ్రి వీరభద్రం.

ఎథల పెళ్ళిపందిర రాటల్ని పుచ్చుకుని రంగురంగుల పరికిణీలు, బుల్లిబుల్లి వోణీలు, పట్టుగౌనులూ వేసుకున్న చిట్టి తల్లులంతా నాలుగు స్థంబాలాట ఆడుకుంటున్నారు. ఆ యింట్లో వున్న ఒకే ఒక వాలుకుర్చీలో పడుకుని పెళ్ళికొడుకు వెంకట్రావు ట్రాన్సిస్టరు ట్యూనుచేస్తున్నాడు. అది బొంయ్ బొంయ్‌మంటూ బరబరలూ గరగరలూ మధ్యన ఏవో శబ్దాలు చేస్తూ మిమిక్రీ ఆర్టిస్టులా నవ్విస్తోంది

ఆ వసారాలో కొత్తగా అల్లిన తాటాకు చాపలమీద కూర్చున్న వియ్యాపురాలు స్టీలుగ్లాసులో కాఫీని వూదుకుంటూ భర్త వెంకటేశ్వర్లుని చేత్తో పొడుస్తూ— 'వాడ్ని కాస్త కనిపెట్టి వుండండి మన వాడు మన పరువు దక్కించేలా లేడు. ఆ పిల్ల కంటికి నదరగా కన్పిస్తూంటే వీడిక ఆగేట్టులేదు. స్కూటరయినా యిస్తేగాని పిల్లాడు కార్యానికి ఒప్పుకోడంలేదని మీరు తెగేసిచెప్పండి, మెమ్మే అని నీళ్ళు నవుల్తూ కూచోక—' అంది.

'నువ్వు చెప్పు వాడికి. వాడ్నే అడగమను. అది బాగుంటుంది—' అని నసిగాడు వెంకటేశ్వర్లు.

'వాడు ఆ కమల ఏ గదిలో వుంటే ఆ గదిలో దూరుతున్నాడు—వాడ్ని లోకువ కట్టి వాళ్ళు మనుగుడుపుల్లోనే ఆ అవపోసన కాస్తా అయిందనిపించేట్లున్నారు. నేనెంత నెత్తినోరూ బాదుకుంటే ఏం



లాభం? మీరు బెల్లంకొట్టిన రాయిలా కదల్లేరు, మాట్లాడతారు. ఇహ యీ తగూలన్నీ నా నెత్తిమీదకి నెట్టేస్తున్నారు. మీరూ మీరూ బాగుండాల, మధ్యన వియ్యపురాలి పీనుగ గయ్యాళిది - అనిపించుకోవాలి నేను-' అని ఆవిడ కొత్త తాటాకు విసినికఱ్ఱను విసవిసలాడించింది.
ఈ మధ్యలో గులాబీరంగు జరీఅంచు చీరలో వయ్యారిభామలా అలంకరించుకొని పెళ్ళిపందిట్లోకి వచ్చింది కమల.

'యిందతీసుకోండి అత్తయ్యా' అని వో వెండిగిన్నెలో కొబ్బరిపీళ్ళూ, మరో వెండిపళ్ళెంలో లేత కొబ్బరి ముక్కలూ వేసి పంచదార చల్లినవి పట్టుకొచ్చింది.

'నాకెందుకమ్మా యివన్నీ.మీ ఆయనకిచ్చి వాడ్ని మంచి చేసుకో - కోపం మీదున్నాడు. స్కూటరిస్తేగాని లేవడ్డ కుర్చీలోంచి . మీ నాన్నతో చెప్తావో మీ అమ్మతో చెప్తావో నీ యిష్టం-' అని ఆవిడ విశ్వామిత్రుడు బిడ్డ శకుంతలను ఎత్తుకొని వచ్చిన మేనకను తోసేసినట్లు చేయి అడ్డంగా పెట్టింది.

కమల ఆ వెండిపళ్ళాన్ని వెండిగిన్నెనూ మావగారికి అందివ్వగానే 'మా తల్లే' అని రెండూ అందుకుని సంతోషించాడు, వో పక్కన కట్టుకున్న యిల్లాలు గుడ్లురుముతున్నప్పటికీ.

కమల అలా విసవిసా నడుచుకుంటూ జెండాలా పట్టుకున్న పవిటతో వెంకట్రావు మొహాన్ని రాసుకుంటూ వెళ్ళింది. ఆ చెంగుకు రాసిన సంపంగి సెంటు పరిమళం ఆ అమ్మాయి వంటిమీంచి వస్తున్న లావెండరు సువాసనలూ వెంకట్రావు మనఃపటలం మీద వలపు తీగల్ని అల్లి శృంగార పుష్పాన్ని శత సహస్రంగా వికసింపజేశాయి

గుర్రంబండి దగ్గర కొస్తుందనుకున్నాడు. మరచెంబు మూత దెబ్బను కూడా అతను లక్ష్యపెట్టడం లేదు ఆ ఉదయం అతను ఆ చిన్నగదిలో మూల కూర్చొని తన హాండ్‌బాగ్‌లో పీళ్ళకలిపి దాచుకున్న 'వోల్డు టావరిన్' విప్పుని సేవిస్తూ సిగరెట్టు పీలుస్తున్నాడు. ఆ యింట్లో ఆ గది వల్మీకంలా అతనికి తోచింది. ఆ వుత్సాహంలో అతనొక పొరపాటు పని చేశాడు. ఆ టార్చిలైటు వెయ్యకుండా పూరుకుని దగ్గర కెళితే ఆ లావెండరు వాసనల్నీ, మంచిగంధపు ఘుమఘుమల్నీ తనవి చేసుకునేవాడు ఛీ ఛీ బజారు రవుడీ చేసేపని తను చేసి లోకువయ్యాను పల్లెటూళ్లో చిన్న చిన్న రొమాన్సులకి చాలా పీలుంటుంది తొందరపడకపోతే-కమల ఎవరో అనుకుని విసిరి తరువాత తనేనని తెలిసి ఫీలయివుంటుంది. ఛ ఛ కమల అలాంటిది కాదు. ఇంకా నయం తను 'వోల్డ్ టావరిన్' మీదున్నదని తెలీదు పల్లెటూరి మొహం! చూస్తే మేర - ఫిగర్ చాలా స్మారెత్తి [illegible] ఈ [illegible]

శ్నాకరూః మనుగుడుపులు, కాకర కాయలూ అంటూ, పెళ్ళయి కాపురాల్చేసి పిల్లల్ని కనేసినవాళ్ళకు 'యంగ్ కపుల్స్' బాధలేం తెలుస్తాయ్ః అక్కడికీ రాత్రి పెళ్ళిపీటలమీద-జీలకర్ర నెత్తిన పెట్టి తలంబ్రాలు పోసుకున్నాక-పక్కకు వచ్చి పిల్ల కూచున్నప్పుడు (పెట్రో మాక్సువాడు గాలి కొట్టడానికి దీపాన్ని అరుగుమీద పెట్టినప్పుడు) ఆ క్రీనీడలో పసుపుబట్టల పడుచుపిల్లని వాటేసుకుని ముద్దుపెట్టుకుంటే-తెల్లబోయినట్లు పురోహితుడికేసి చూస్తూ ఎడంచేత్తో బొట్టమీద గిల్లింది. యింటికెళ్ళాక గోళ్ళు తీయించెయ్యాలి దీనికి. తలంబ్రాలు పోస్తున్నప్పుడు కావాలని జాకెట్లోకి వంపేస్తే, పళ్ళెంతో నెత్తిమీద మొట్టింది పిల్ల టిట్ ఫర్ టాట్‌లా వుంది. చెండ్లాటలో కూడా పూలచెండుతో పమిట మీదకు విసిర్తే, తీసి మొగంమీద కొట్టింది_కళ్ళజోడు ఎగిరి పక్కన కూచున్న పడచు పేరంటాలి జుట్టులో చిక్కుకుపోయింది. తప్పు తప్పు "ఫౌల్ ఫౌల్" అని మా చెల్లాయి అరిస్తే "షటప్" అంది. దీన్ని మచ్చిక చేసుకోవాలంటే స్లో టాక్టిక్స్ లాగించాలి. మన కవే తెలిసిచావ్వు. ఇద్దర్నీ వో గంటసేపు ఫ్రీగా వొదల్రే యీ చుట్టమ్సు అండ్ ఫ్రేమ్‌ల్స్. ఆయురారోగ్య అయిశ్వర్యాభి వృద్ధిరస్తు అని యిన్ని అక్షంతలు వేసి కాళ్ళకు దండాలు పెట్టిచుకుంటారు కాని ప్రేమ పారాలు చెప్పుకోనివ్వరేః-యిలా ఆలోచిస్తూంటగా చెవిలో ఎవరో 'స్కూటరడుగు-స్కూటరడుగు-స్కూటరడుగు' అని మున్మార్లు మంత్రోచ్చారణ చేసినట్లు యింది. ఎవరా అని చూస్తే కన్నతల్లి.

ఇంతలో 'మా అమ్మాయి పాలకొల్లు దాకా పెళ్ళికొడుకుని వెనక కూచో పెట్టుకుని సైకిలు తొక్కేస్తుంది. అంతే కాదు యీ కాలవను యివతల్నుంచి అవతలకు బారీత యీదేస్తుంది-ఛాలెంజ్' అంటున్నాడు మావగారు, అరిటికాయ పూచను సన్నగా బిళ్ళలుగా తరుగుతూ. 'గునపం తిరగేసి పాతి పాతిక కొబ్బరి కాయలని వలిచేస్తుంది మా కమల. దానికి కొబ్బరిచెట్టు ఎక్కటం వచ్చు. ఇంగ్లీషు కుణ్ణం. పార్శింగ్ వచ్చు, అష్షనల్ మేథమెటిక్స్‌లో హండ్రడ్‌కి హండ్రడ్' అని అరుస్తున్నాడు, ఢిక్కు లెగిరిపోయేలా_యిలాటి వీరభద్రం మావగార్ని స్కూటరడగడం?

'అన్నయ్యా మీ ముద్దుల అల్లుడికి స్కూటర్ కావాలిట - యివ్వకపోతే అన్నానికి లేవడ్ట-' అంది వియ్యపరాలు.

'లేవడాః లేవకపోతే వండిన వంటంతా వూళ్లో హరిజన్లని పిల్చి నాలుగు బంతులు లేవదీయిస్తాను. నా దగ్గిర యిలాటి వెర్రివేషాలు కుదరవ్. ఇప్పుడు స్కూటరంటాడు. మరి కాస్సేపు పోయాక వీడియో కొంటేకాని తొంగోనంటాడు. నేనేం వెర్రి వెధవ

నమకొంటున్నారా? నా వల్ల కాదు మహా ప్రభో. .నన్ను ఫకీర్ వెధవను చెయ్యకుండా నా మర్యాద దక్కించి మీ మర్యాద దక్కించుకోండి.'

వియ్యపురాలి మొహం కందగడ్డలా అయింది. వెంకటేశ్వర్లు నెమ్మదిగా వియ్యంకుడి హోదా వదిలేసి 'బావా మా అమ్మ నీకు వేలిడిచిన అప్ప మవ్వా నేనూ తల్లివేపు వరసవాళ్ళం. పిల్లవాడు అడగడం ఓ ముచ్చట. అది యిప్పుడుగాక యింకెప్పుడు అడుగుతాడు. సరే యిస్తానంటే గోలా-తరవాత వీలు చూసుకుని ఆ ముచ్చట తీర్చవచ్చు-అదో సరదా' అని నసిగాడు

వీరభద్రం యింకా రెచ్చిపోయాడు- "సరదా కాదు గాడిదగుడ్డేం కాదూ! ఇప్పుడు 'వూ' అంటే రేపు అడిస్తే కాని పిల్లని కాపురానికి తీసికెళ్ళం అంటారు ఒకటిస్తే మరోటి - కాలికేస్తే మెడకి, మెడకేస్తే కాలికి తీరా యిచ్చాక విమానం కొనిస్తేనేకాని అమ్మాయిని పుట్టింటికి పంపం అంటారు ఆడిస్తే అడ మన్నట్లు ఆడ్డానికి నేనేం చవటను గాను. ఈవూరి పంచాయతీని పన్నెండేళ్లు గడ గడ లాడించాను. పౌరుషంగా మీస మున్న మగాడిలా బతికాను! ఎవడికీ తలొంచలేదు. నా పిల్లలు గజ-గజ- నేనెల్లా చెప్తే అల్లా వింటారు. స్టాండప్ అంటే నిల్చుంటారు.' ఆ ధోరణిని అడ్డుకుంటూ-'సర్లే బావా - మన పిల్లల సుఖంకోసం మనం ఏవైనా చేస్తాం- ఆవునా?' అన్నాడు వెంకటేశ్వర్లు.

'నేను చెయ్యను. నో స్కూటర్! నో నాన్సెన్స్!' అని తెగేసి చెప్పాడు వీరభద్రం.

అప్పుడు వియ్యపురాలు తను లేచి 'ఇక లేవండి. చాలా గొప్ప సంబంధం తెచ్చారు కజాజకోరు సంబంధం నిన్న టికి నిన్న మా అత్తగారు రాత్రికి తినదు రొట్టెలు చేయించండీ అంటే మీ బోడి అత్తగారు తినకపోయినా పెళ్ళవుతుంది. తింటే తినమనండి లేకపోతే లేదు అన్నారు పెళ్ళికొడుకు స్నేహితులకి సిగ రెట్లు పేకదస్తాలు కావాలంటే ముందలు కూడా కావాలా కనుక్కోమన్నాడు యీ పెద్ద మనిషి. కాఫీలు చాల్లేదంటే డబ్బు లివ్వండి. కాలవగట్టు హోటల్నుంచి తెప్పిస్తానన్నాడు. ఓ మంచీ లేదూ ముచ్చటాలేదు - పేచీకోరు సంబంధం పిల్లను పంపించెయ్యమనండి మన్తో. పిల్లను తీసుకు వెళ్ళిపోదాం - లేరా నాన్నా లే-యింటి కెళ్ళిపోదాం' అని మారింగు యిచ్చేసింది.

'నువ్వూరుకో - నువ్వూరుకో' అని వెంకటేశ్వర్లు కోడిపుంజులా రెచ్చిపోతున్న పెళ్ళాన్ని బతిమాలాడాడు ఆవిడ గుడ్లెర్రజేసి 'యిది నా కొడుకూ- నా వ్యవహారం. మీరు నోరు మూసు

కోంది, అని గర్జించింది

అప్పుడు వీరభద్రం 'అమ్మాయి కమలా—' అని వో గావుకేక పెట్టాడు. కమల 'హా నాన్నా' అంటూ వచ్చింది.

'నువ్వు బావని వెయ్యిపట్టుకు భోజనానికి తీసికెళ్ళమ్మా' అన్నాడు

'లేచావా' అని అనకుండా కమల అటువంటి చూపుతో వెంకట్రావు చేయి పుచ్చుగుని లాగింది వయ్యారంగా. ఏదో ట్రాన్స్‌లో వున్న పెళ్ళికొడుకును ఇంద్రధనుస్సులోంచి నడిచి మబ్బుల్లో వాకింగ్ చేస్తున్నట్లు లేచి దీపంవెంట నీడలా వెళ్ళాడు.

'హరి వీడి అమాయికత్వం కూలా—' నెత్తిమీద చేతులు పెట్టుకొని నిలబడి పోయింది పెళ్ళికొడుకు తల్లి. అప్పుడే అక్కడకు వచ్చిన పెళ్ళికూతురి తల్లి 'వదినా అన్నీ జరుగుతాయి-ఎందుకు లేనిపోని గొడవలు. అన్నాలు చల్లారుతున్నాయి పిల్లలు ఆకళ్ళని గొడవ చేస్తున్నారు. రండి-మీ రాయన కేకల్ని పట్టించుకోవద్దు అన్నగారూ మా మీద దయవుంచండి, శుభ్రంగా పెళ్ళిచేసుకుని పెళ్ళివారు అభోజనంగా వెళ్ళిపోయారు అన్న మాటమాత్రం మిగల్చకండి. ఏది ఎలా జరగాలో అంతా అలా జరుగుతుంది దీనికి ఆ పిల్లాడికి రాసి పెట్టివుంది. భగవంతునిదయ—'అని చేతు లెత్తి ఏడుకొండలవాడికి దండం పెట్టింది.

ఆ రాత్రికి కార్యం ముహూర్తం పెట్టారు. కోడలికొంగున కట్టే కానుకొని తేవడానికి వెంకటేశ్వర్లు పాలకొల్లు పరిగెట్టాడు వియ్యపురాలికి పెళ్ళికూతురి తల్లి బెనారెస్ వట్టుచీర కొనిచ్చింది.

వీరభద్రం తోటలోంచి ఒక దొంగ అరటి చెట్టు కనపడకుండా దాచుకున్న ముగ్గనున్న అరటి పళ్ళగెలను సావిడి మధ్యలో వేలాడకట్టాడు

ఆ గెల చుట్టూ పిల్లలే—గోల—ఒకటే గోల!

